


ఎలుగు హల్‌చల్

ఉద్దానంలో మళ్లీ ఎలుగు హల్‌చల్ చేసింది. పట్టుకోవడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు. - 8లో



130 పరిశ్రమలకు అనుమతులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో పరిశ్రమల స్థాపన వేగవంతం కావాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. జిల్లాలో 130 పరిశ్రమలకు అనుమతులు ఇచ్చామన్నారు.

ఆన్‌లైన్ ద్వారా రవాణా శాఖ చెల్లింపులు

శ్రీకాకుళం రూరల్: రవాణా శాఖ చెల్లింపులు ఆన్‌లైన్ ద్వారా కూడా చేసుకోవచ్చు. శాఖకు సంబంధించిన అన్ని చెల్లింపులు, అలాగే చెక్‌పోస్టు వద్ద చెల్లించే చెల్లింపులు ఆన్‌లైన్, క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లించాలని ఉపరవాణాశాఖాధికారి శివరామ్ ప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

న్యూస్‌రీల్

టీహెచ్ఆర్ పంపిణీకి సంచులు సిద్ధం



ప్రాజెక్టు కార్యాలయానికి చేరిన టీహెచ్ఆర్ సంచులు

సారవకోట: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు త్వరలో ఇంటికి సరుకులు ఇచ్చేందుకు సంచులు సిద్ధమయ్యాయి. వీరికి ఇది వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజనం వండి పెట్టేవారు. అయితే గర్భిణులు, బాలింతల కోరిక మేరకు ప్రభుత్వం ఇక నుంచి టీహెచ్ఆర్(టేక్ హోం రేషన్) రూపంలో ఇంటికే పౌష్టికాహార సరుకులు అందించనుండటంతో వాటిని అందించేందుకు సంచులు సిద్ధం చేశారు. స్థానిక ప్రాజెక్టు కార్యాలయం పరిధిలో గర్భిణులు, బాలింతలకు సరిపడా ఈ సంచులు 1156 వచ్చినట్లు సీడీపీఓ హెచ్‌కె కామాక్షి తెలిపారు.

డ్రోన్ దొరికింది



బెండి కొండపై గుర్తించిన డ్రోన్

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు మండలం బెండిలో ఈ నెల 12న అదృశ్యమైన డ్రోన్ ఆచూకీ శుక్రవారం లభించింది. ఎంఆర్ఐ డి. పవిత్ర, వజ్రపుకొత్తూరు, నందిగాం సర్వేయర్లు సుభాష్, కె.జోగారావు ఆధ్వర్యంలో బెండికొండ రిజర్వ్ ఫారెస్టును జల్లెడ పట్టారు. నందిగాం నుంచి వచ్చిన 17 మంది కూలీలు, యు.రామారావు, సీహెచ్. హరీష్, శివ, రామారావు, హేమంత్ తదితర ఏడుగురు గ్రామ సర్వేయర్లు కలిసి మూడు బృందాలుగా ఏర్పడి ఉదయం 6 గంటల నుంచి కొండ ప్రాంతంలో గాలించగా మధ్యాహ్నం 1.30కు కొండపై డ్రోన్ దొరికింది. అయితే అది పాక్షికంగా దెబ్బ తిన్నట్లు సర్వేయర్లు గుర్తించారు. దాదాపు రూ.4లక్షలు వరకు నష్టం జరిగి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. డ్రోన్ దొరకడంతో తహసీల్దార్‌కు సమాచారం అందించారు. ఆయన ఈ విషయాన్ని అమరావతిలో జగనన్న శాశ్వత భూ హక్కు- భూ రక్ష పర్యవేక్షిస్తున్న సర్వే లాండ్స్ అండ్ రికార్డుల ఏడీ డీఎల్‌బీఎల్ కుమార్‌కు, జిల్లా సర్వే శాఖ ఏడీ దృష్టికి తీసుకెళ్లి డ్రోన్‌ను శ్రీకాకుళం పంపించారు.

24, 25 తేదీల్లో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ ప్రవేశాల కౌన్సెలింగ్

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రంలోని నాలుగు రాజీవ్ గాంధీ సాంకేతిక వైజ్ఞానిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) క్యాంపస్‌ల్లో ఎంపిక జాబితాలను గురువారం విడుదల చేశారు. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి 1100 మంది విద్యార్థులను కేటాయించారు. ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ కోర్సుల్లో విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తారు. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ ఎస్ఎం పురం క్యాంపస్‌లో సీట్లు లభించిన విద్యార్థులకు ఈ నెల 24, 25 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. పీయూసీ (ప్రీ యూనివర్సిటీ కోర్సు) మొదటి ఏడాది ప్రవేశాలు కల్పిస్తారు. పీయూసీ రెండేళ్లు, ఇంజినీరింగ్ నాలుగేళ్లు విద్యార్థులు చదువుతారు.

ఇస్రోకు శుభాకాంక్షలు



ఇస్రోకు శుభాకాంక్షలు చెబుతున్న విద్యార్థులు

కంచిలి: మండలంలోని కత్తివరం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు చంద్రయాన్-3 ప్రయోగం సందర్భంగా ఇస్రోకు శుభాకాంక్షలు తెలిపారు. విజయవంతంగా నింగిలోకి ప్రవేశపెట్టినందుకు అభినందనలు తెలిపారు. ఈ మేరకు విద్యార్థులు, ఉపాధ్యాయులు శుక్రవారం సాయంత్రం ప్లకార్డులు ప్రదర్శించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

'క్షమాపణ చెప్పాల్సిందే'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వలంటీర్లకు క్షమాపణ చెప్పాల్సిందేనని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి డిమాండ్ చేశారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కరోనా సమయంలో వలంటీర్ల సేవలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని, వేరే వాళ్లు ఇచ్చిన స్క్రిప్టును చదువుతున్న పవన్ కల్యాణ్ వలంటీర్ల మనోభావాలను దెబ్బ తీస్తున్నారని తెలిపారు.

రెండు రంగాలకు ఊతం..

ఉపాధి రథం



శ్రీకాకుళం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన సంతోష్, లోకేష్ టిఫిన్లను విక్రయిస్తుంటారు. మున్సిపాలిటీ పరిధిలో ట్రాఫిక్ మధ్య బండి ఏర్పాటు చేయాలంటే చాలా కష్టం. అందుకే మొబైల్ క్యాంటీన్ సిద్ధం చేయాలనుకున్నారు. కోల్‌కతా నుంచి చార్జింగ్ ఆటోను తెప్పించారు. ఫ్యాబ్రికేషన్ వర్కర్‌ని కలిసి తాము చేయబోయే వ్యాపారం ఇతర వివరాలను చెప్పారు. పదిరోజుల వ్యవధిలో మొబైల్ క్యాంటీన్‌ను రెడీ అయింది.



శ్రీకాకుళానికి చెందిన ఓ యువకుడు ఇటీవలే చికెన్ షాపు ప్రారంభించాడు. రోజూ ఫారం నుంచి కోళ్ల నుంచి తీసుకురావడంలో ఇబ్బందుల్ని గమనించాడు. ఫ్యాబ్రికేషన్ వర్కర్‌ని కలిసి తన అవసరాన్ని వివరించాడు. ద్విచక్రవాహనం వెనక వైపు కోళ్లను తరలించేలా ప్రత్యేక ఏర్పాటు చేయించుకున్నాడు.

- అవసరాలకు అనుగుణంగా వ్యాపార వాహనాల తయారీ
- కొత్త తరహా బళ్లతో చిరు వ్యాపారులకు ఉత్సాహం
- వ్యాపారుల ఆలోచనలకు రూపమిస్తున్న ఫ్యాబ్రికేటర్లు

ప్రస్తుత పోటీ ప్రపంచంలో మనదంటూ ఏదో ప్రత్యేకత, కొత్తదనం ఉంటే తప్ప రాణించలేం. వ్యాపారానికి కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. దానికి ఆలోచన, ఆర్థిక స్థోమత అవసరం. చిరు వ్యాపారులు, రెక్కల కష్టంతో జీవన రథాన్ని లాగుతున్నవారికి తమ వ్యాపారాన్ని సులభ సాధ్యం చేసుకోవాలని, అదనపు సొబగులు అద్దాలని ఆశ ఉన్నా.. ఆర్థిక సమస్యలు వెనక్కి లాగుతున్నాయి. దాంతో వారు సృజనకు పదును పెడుతున్నారు. సూక్ష్మంలో మోక్షంలా తక్కువ ఖర్చుతోనే అదనపు హంగులు అద్దే ఆలోచనలు చేస్తున్నారు. వాటిని ఫ్యాబ్రికేటర్ల సాయంతో ఆచరణలో పెడుతున్నారు. తమ ఉపాధి రథాలకు కొత్త రూపునిచ్చి, వ్యాపారాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్నారు. చిరు వ్యాపారులు సృజనశీలత ఫ్యాబ్రికేషన్ రంగం అభివృద్ధికి కూడా ఊతమిస్తోంది.

-శ్రీకాకుళం డెస్క్

జిల్లాలో చాలా మంది తమ రోజు వారీ వ్యాపార వ్యవహారాలకు సంబంధించిన అవసరాల కోసం ఉపాధి రథాలను తయారు చేయించుకుంటున్నారు. ఈ బళ్ల తయారీకి ఉపాధి బాగుండడంతో చాలా మంది వీటి తయారీలో మెలకువలను నేర్చుకుని అద్భుతమైన రీతిలో బళ్లను రూపొందిస్తూ కస్టమర్లకు అందిస్తున్నారు.

వాస్తు ప్రకారం...

వ్యాపారి అవసరం.. బడ్జెట్‌ను బట్టీ బండి తయారీ డిజైన్ రూపొందిస్తామని చెబుతున్నారు తయారీదారులు. ఆహార విక్రయాలకు సంబంధించిన బళ్ల విషయంలో స్టెయిన్‌లెస్ స్టీల్‌తో మాత్రమే రూపొందిస్తామని, అలా అయితేనే రోజువారీ శుభ్రపరుచుకునేందుకు వీలుగా ఉంటుందని.. తుప్పు పట్టదని



కూరగాయలను తరలించే బండి



వాహనాన్ని సిద్ధం చేస్తూ..

శ్రీకాకుళంలోని సాయినాథ్ ఫ్యాబ్రికేషన్స్ యజమాని ఈశ్వర్ ప్రసాద్ రావు సాక్షికి తెలిపారు. అలాగే వీరు రూపొందించే వాహనంలో దోసెల పెనం.. వేడి చేసే ప్రత్యేక ఏర్పాట్లు.. వాటర్ ట్యాంక్.. వాష్ బేసిన్ లాంటివి ఉంటాయి. కాబట్టి పక్కా వాస్తు ప్రకారమే బండిని సిద్ధం చేస్తామని చెప్పారాయన.

ఉపాధి కోణం..

శ్రీకాకుళం నగరంలో ఈ తరహా బళ్లను రూపొందించే సంస్కృతి 2016లో మొదలైందని చెబుతున్నారు తయారీ దారులు. ఇటీవల కాలంలో ఉపాధి కోసం బళ్లను వినియోగించే వారి సంఖ్య పెరగడంతో తమకూ మంచి ఉపాధి లభిస్తోందని అంటున్నారు. పాతబండైనా.. కొత్త బండైనా ఫ్యాబ్రికేషన్ వర్క్స్ ఖర్చు ఒకటేనని చెబుతున్నారు. తయారీకి వినియోగించిన స్టీల్ బరువును బట్టి చార్జీలుంటాయని చెప్పారు. కేజీ స్టీల్ వినియోగిస్తే స్టీల్, లేబర్ చార్జీ రూ.650 వరకు తీసుకుంటామని వివరించారు.

పర్యావరణ స్పృహ..

ఫ్యాబ్రికేషన్ పనులకు సంబంధించిన ఇటీవల పర్యావరణ హితమైన బ్యాటరీ చార్జింగ్ వాహనాలకే ప్రాధాన్యమిస్తున్నారని చెబుతున్నారు తయారీదారులు. వీటిని కోల్‌కతా నుంచి నగరానికి తెప్పిస్తున్నామన్నారు. వీటి ఖరీదు రూ.1.25 లక్షల వరకు ఉందని.. ఫ్యాబ్రికేషన్ పనితో కలిపి దాదాపు రూ.3లక్షల వరకు ఒక్కో బండికి ఖర్చవుతుందని వ్యాపారి వెంకటేశ్వరరావు 'సాక్షి'కి చెప్పారు.

- కోళ్లను తరలించేందుకు, తోపుడు బళ్లకు, గ్యాస్ డెలివరీ బాయ్స్ వాహనాలకు సంబంధించి రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చు అవుతుంది.
- అలాగే రాత్రి వేళల్లో వ్యాపారం సాగించే వారి కోసం ఎల్ఈడీలతో కూడిన ప్రత్యేక లైట్లను వినియోగిస్తున్నారు. సోలార్ సదుపాయం ఉన్న వాహనాలు కూడా నగరంలో ఉన్నాయి.

ఐదుబళ్లు తయారు చేయించా..



తొలినాళ్లలో నేను తోపుడుబండితో వ్యాపారం చేసేవాడ్ని. ఇప్పుడు దాని నిర్వహణ కష్టతరంగా మారింది. 2016లో తొలిసారిగా నగరంలోనే బండిని తయారీ చేయించా. ప్రస్తుతం ఇలాంటి బళ్లు నా వద్ద ఐదు ఉన్నాయి. అన్నీ బ్యాటరీ వాహనాలే.

– కిల్లంశెట్టి వెంకటేశ్వరరావు, మొబైల్ క్యాంటిన్ వ్యాపారి.

డిమాండ్ బాగుంది..



వ్యాపారుల అవసరాలను బట్టి డిజైన్ చేస్తున్నాం. వాస్తు ప్రకారం చేస్తున్నాం. డిమాండ్ బాగానే ఉంది. మొబైల్ క్యాంటీన్లు ఎక్కువగా తయారు చేయిస్తున్నారు. దేవాలయాలకు సంబంధించిన రథాలను కూడా తయారు చేస్తున్నాం. పెళ్లి ఊరేగింపులకు వినియోగించే వాహనాలను సిద్ధం చేస్తున్నాం.

–శలపాక ఈశ్వర ప్రసాదరావు, సాయినాథ్ ఐరన్ అండ్ స్టెయిన్‌లెస్ స్టీల్ ఫ్యాబ్రికేటింగ్ వర్క్స్



దేవుని ఊరేగింపు కోసం రథం..

వాహనం తయారీకి పట్టే సమయం	కేజీ స్టీల్‌కి ల్యాబర్ చార్జీతో సహా వసూలు చేసే మొత్తం	ఏయే వాహనాలు	ఫ్యాబ్రికేషన్స్ పనుల మీద ఆధారపడి జీవిస్తున్నవారు
10 నుంచి 30 రోజులు	రూ.650 వరకు	మొబైల్ క్యాంటీన్లు, డీజే వాహనాలు, టిఫిన్ బళ్లు, టీబళ్లు, రిక్షా ట్రాలీలు, గ్యాస్ డెలివరీ చేసే ద్విచక్రవాహనాలు	50 మంది వరకు

ఏపీపీజీ సెట్‌లో సిక్కోలు సత్తా



రాజశేఖర్



సోమేశ్వరరావు



చంద్రకళ



కిషోర్

సరుబుజ్జిలి,కోటబొమ్మాళి: ఆంధ్రప్రదేశ్ పోస్ట్‌గ్రాడ్యుయేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీపీజీసెట్) ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో పాలవలస గ్రామానికి చెందిన టంకాల రాజశేఖర్ కెమికల్ సైన్స్ విభాగంలో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. కోటబొమ్మాళి మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన గుంట సోమేశ్వరరావు ఏపీ పీజీ సెట్‌లో సైకాలజీ విభాగంలో రెండో ర్యాంకు సాధించాడు.

కొత్తూరు: కొత్తూరుకు చెందిన రుద్రపంక్తి చంద్రకళ ఎకనామిక్స్‌లో రెండో ర్యాంకు సాధించింది.

పాతపట్నం: పాతపట్నంకు చెందిన ఎల్.కిషోర్‌కు లైఫ్ సైన్స్ విభాగంలో 3వ ర్యాంకు సాధించాడు.

కలమట.. కపట యాత్ర



హిరమండలం మజ్జిగూడేం వద్ద కలమట వేసిన శిలా ఫలకం



పాతపట్నం: తెంబూరులో మిని రిజర్వాయర్‌గా చేపడతామని వదిలేసిన ఆసర్ల సాగరం



పాతపట్నంలో రూ.22కోట్లతో అండర్‌డ్రైనేజీకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణ (ఫైల్)

రైతుల్ని మోసం చేశారు



తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మజ్జిగూడేం వద్ద ఎత్తిపోతల పథకం నిర్మిస్తామని అప్పటి ఎమ్మెల్యే కలమట వెంకటరమణ 2019లో శిలా ఫలకం వేశారు. పనులవుతాయని, మా పొలాలకు నీరు అందుతుందని ఆశ పడ్డాం గానీ ఆయన పనులు చేయలేదు.

– పాలక తిరుపతిరావు, కోదూరు గ్రామం, హిరమండలం

- పాతపట్నంలో టీడీపీ బస్సుయాత్ర నేడు
- అధికారంలో ఉండగా నియోజకవర్గాన్ని వదిలేసిన వైనం
- ప్రతిపక్షానికి రాగానే విపరీతమైన ప్రేమ కురిపిస్తున్న 'కలమట'
- కలమట యాత్రపై స్థానికుల పెదవి విరుపు

ఎల్.ఎన్ పేట, పాతపట్నం: చేతిలో అధికారం ఉన్నప్పుడు మాటలు తప్ప పనులు చేయలేదు. ఊరూరా తిరగడం, హామీల మీద హామీల ఇవ్వడం .. ఆనక మర్చిపోవడం. గతంలో ఐదేళ్ల పాటు ఇలాగే కాలక్షేపం చేసిన కలమట వెంకటరమణకు జనం మర్చిపోలేని తీర్పునిచ్చి ఇంటిలో కూర్చోబెట్టారు. ఇప్పుడు మళ్లీ ఆయన అధికారం కోసం బస్సు యాత్ర మొదలుపెడుతున్నారు. పాతపట్నం నియోజకవర్గంలో శనివారం నుంచి యాత్ర మొదలుకానుంది.

కప్పగెంతుల కలమట

2014 ఎన్నికల్లో పాతపట్నం నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన కలమట వెంకటరమణను ప్రజలు గెలిపించారు. కానీ టీడీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. దీంతో ఆయన నియోజకవర్గ అభివృద్ధి సాకు చెప్పి 2016లో పార్టీ మారిపోయారు. అభివృద్ధి మాట అటుంచితే.. అధికారం అడ్డం పెట్టుకుని ఇష్టారాజ్యంగా అక్రమాలకు పాల్పడ్డారు. ఇసుక వ్యాపారం, వంశధార నిర్వాసితులకు చెల్లించే పరిహారంలో బినామీల పేర్లతో అక్రమాలు చేశారు. పాతపట్నం నియోజకవర్గంలోని ప్రజలకు ఉపయోగపడే శాశ్వత అభివృద్ధి పని ఒక్కటి కూడా చేపట్టలేదు.

కలమట హామీల్లో కొన్ని..

హామీల మూటలు

- మెళియాపుట్టి మండల కేంద్రంలో తహసీల్దారు భవన నిర్మాణ పనులు 2019కి ముందు అర్ధంతరంగా నిలిచిపోయాయి.
- పాతపట్నం మండలంలోని కాగువాడ-రొమదల మధ్య మహేంద్రతనయ నదిపై వంతెన నిర్మాణం చేపడతామని మాటిచ్చి మర్చిపోయారు.
- పాతపట్నంలో అండర్‌డ్రైనేజీ ఏర్పాటు చేస్తామని శంకుస్థాపన చేసి వదిలేశారు.
- హిరమండలం మండలంలోని కల్లట-జిల్లేడుపేట గ్రామాల మధ్య మహేంద్ర తనయ నదిపై వంతెన నిర్మాణం హామీలకే పరిమితమైంది.
- హిరమండలం మండలం మజ్జిగూడేం వద్ద సుమారు రూ.10కోట్లు ఖర్చుతో ఎత్తిపోతల పథకం పనులు శిలా విగ్రహానికే పరిమితమయ్యాయి.
- కొత్తూరు నుంచి ఎల్.ఎన్.పేట వరకు వంశధార నదికి కరకట్టల నిర్మాణం పనులు ఎన్నికల ముందు ఆర్భాటంగా మిగిలిపోయాయి.
- ఎల్.ఎన్.పేట మండలం కడపలవాని గెడ్డ వంతెన నిర్మాణం కూడా పూర్తి చేయలేకపోయారు.

వైఎస్సార్ సీపీ పాలనలో..

అభివృద్ధి జాడలు

- మెళియాపుట్టిలో తహసీల్దారు భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే రెడ్డి శాంతి అదనంగా మరో రూ.20లక్షల నిధులు తెచ్చి పనులు పూర్తి చేయించారు.
- కాగువాడ-రొమదల మధ్య మహేంద్ర తనయ నదిపై వంతెనపై ప్రత్యేక శ్రద్ధ వహించి రూ.6.95కోట్లు మంజూరు చేయించి, సకాలంలో పనులు చేపట్టి, ఈ మధ్య ప్రారంభోత్సవం నిర్వహించనున్నారు.
- పాతపట్నం నియోజకవర్గం ఐదు మండలాల ప్రజలకు తాగునీరు అందించేందుకు రూ.265 కోట్లు విడుదల చేశారు.
- వంశధార నిర్వాసితులకు అదనపు పరిహారం కోసం రూ.236.72 కోట్లు విడుదల చేశారు.
- పాతపట్నం మేజర్ పంచాయతీలో విద్యుత్ సమస్య పరిష్కారం కోసం రూ.93 లక్షల ఖర్చుతో 15 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు.
- రూ.2.50 కోట్లు ఖర్చుతో కొత్తూరులో పోలీసు స్టేషన్ భవనం నిర్మించారు.
- ఎల్.ఎన్.పేట మండలం తురకపేట, కొత్తూరు మండలం మెట్టూరులో ప్రభుత్వ ఆస్పత్రులు ఏర్పాటు చేశారు. ఐటీడీఏ, ఆర్అండ్‌బీ, పీఐయూల ద్వారా సుమారు రూ.56 కోట్లు ఖర్చుతో రోడ్ల నిర్మాణం, మరమ్మతులు పనులు పూర్తి.
- నాడు-నేడు రెండు విడతల్లో 246 పాఠశాలల అభివృద్ధికి రూ.46.38కోట్లు ఖర్చు.



వంశధార తాగునీరు అందించేందుకు జరుగుతున్న పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



మెళియాపుట్టి తహసీల్దారు కార్యాలయ భవనం

● నిధులున్నాయి..

విధులు నిర్వర్తించండి



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ. చిత్రంలో స్పీకర్ తమ్మినేని సీతారాం, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎమ్మెల్సీ నర్తు రామారావు

- ఆమదాలవలస నియోజకవర్గ అభివృద్ధి సమీక్షలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స
- నియోజకవర్గ సమీక్షలతో ఎంతో ప్రయోజనమన్న స్పీకర్ తమ్మినేని
- ప్రతివారం సమీక్షలుంటాయని కలెక్టర్ ప్రకటన

అరసవల్లి: అభివృద్ధి పనులకు నిధుల లోటు లేదని, అధికారులు విధులు సమర్థంగా నిర్వహించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఆమదాలవలస నియోజకవర్గ అభివృద్ధి సమీక్షలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, జాయింట్ కలెక్టర్ నవీన్, డీఆర్వో మురళీకృష్ణ, ఆర్డీవో శాంతి, జెడ్పీ సీఈఓ వెంకట్‌రామన్, సీపీఓ లక్ష్మీ ప్రసన్న, వైఎస్సార్ యువజన నేత చిరంజీవి నాగ్, జెడ్పీటీసీలు బెండి గోవిందరావు, లోలుగు కాంతారావు, ఎస్.నాగేశ్వరరావు, బెజ్జిపురపు రామారావు, ఎంపీపీలు కేవీజీ సత్యనారాయణ, ఫ్లోర్ లీడర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీర్లు అలసత్వం వీడాలి : మంత్రి బొత్స

మంత్రి బొత్స మాట్లాడుతూ పంచాయతీల్లో సచివాలయాలు, ఆర్బీకేలు, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాలు పూర్తి కావాలన్నారు. నాడు-నేడుతో ప్రభుత్వ బడుల్లో మంచి ఫలితాలు వస్తున్నాయని, సీఎం ఆదేశాల మేరకు ఇకపై 6వ తరగతి నుంచే ఇంటరాక్ట్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. గడపగడపకూ మన ప్రభుత్వం, జగనన్న సురక్ష కార్యక్రమాలను చాలా ప్రాధాన్యతతో తీసుకోవాలని సూచించారు. ప్రతి సచివాలయానికి సుమారు రూ.20 లక్షల వరకు నిధులు మంజూరు చేశారని, అలాగే కాంట్రాక్టర్లకు ఇంతవరకు పెండింగ్ బిల్లులు లేకుండా చెల్లించేశామని చెప్పారు. పొందూరు ఇంజినీరింగ్ పనుల్లో బాగా వెనుకబడి ఉందన్నారు. కోర్టు కేసులుంటే జీపీతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు : స్పీకర్ తమ్మినేని

నియోజకవర్గ స్థాయి అభివృద్ధి సమీక్షలు నిర్వహించాలని సీఎం వైఎస్ జగన్ నిర్ణయించడం గొప్ప విషయమని, ఇందుకు ఆయనకు కృతజ్ఞతలని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన అద్భుతంగా ఉందని, ఇంత మందికి సంక్షేమం అందడం గతంలో ఎన్నడూ చూడలేదని అన్నారు. తన నియోజకవర్గంలో రెండు డిగ్రీ కళాశాలలు, వెటర్నరీ, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలు, ఉద్యానవన రీసెర్చ్ సెంటర్, బీసీ గురుకుల పాఠశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల తదితర విద్యాసంస్థలు ఈ నాలుగేళ్లలో ఏర్పాటు చేశామని, ఇందుకు సహకరించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.

సమస్య..పరిష్కారం

ఈ సమీక్షలో మంత్రి బొత్స సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. బూర్జ మండలంలో ఓ దివ్యాంగుడు మంచానికే పరిమితమయ్యాడని, ఆయనకు వస్తున్న దివ్యాంగ పింఛను రూ.3 వేలను రద్దు చేస్తేనే రూ.5 వేలు వస్తుందని చెబుతున్నారని కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందరావు సభ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే మంత్రి బొత్స రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కమిషనర్ జె.నివాస్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కరించారు. పొందూరు మండలంలో విద్యుత్ ఏఎల్ఎం పోస్టు, జేఎల్ఎం పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయని జెడ్పీటీసీ కాంతారావు ప్రస్తావించగా వెంటనే ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్‌తో మాట్లాడి పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అలాగే ఆమదాలవలస నియోజకవర్గంలో పీహెచ్‌సీల్లో 6 ఏఎన్ఎం పోస్టులు ఖాళీలుగా ఉన్నాయని సభ్యులు చెప్పగా కమిషనర్ నివాస్‌తో మాట్లాడి లోకల్‌గా ఔట్‌సోర్సింగ్ ద్వారా ఉద్యోగాల భర్తీ చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌కు ఆదేశించారు.

వారం వారం సమీక్ష : కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

జిల్లాలో ప్రతి శుక్రవారం నియోజకవర్గాల అభివృద్ధి సమీక్షలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. ఈ నెల 21న పలాస, 28న పాతపట్నం, ఆగస్టు 4న ఇచ్ఛాపురం, 11న నరసన్నపేట, 18న ఎచ్చెర్ల, 25న టెక్కలి, సెప్టెంబర్ 1న శ్రీకాకుళం నియోజకవర్గాల అభివృద్ధిపై సమీక్షలు జరుగుతాయన్నారు.

క్లుప్తంగా

ఖైదీలకు ఉచిత న్యాయ సాయం



ఖైదీలతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సన్యాసినాయుడు

గార: ఖైదీలు తమ కేసులకు సంబంధించి న్యాయవాదిని కోరుకుంటే ఉచితంగా లాయర్‌ను నియమిస్తామని న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. శుక్రవారం అంపోలు జిల్లా జైలును సందర్శించారు. ఖైదీల వసతులు, గ్రంథాలయం, భోజన సదుపాయాలపై ఆరా తీశారు. ఖైదీలతో వ్యక్తిగతంగా మాట్లాడి రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ నబీఖాన్, జైలర్ దివాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దళితుల పక్షపాతి సీఎం జగన్



డీసీఎంఎస్ చైర్‌పర్సన్ సల్ల సుగుణ

ఇచ్ఛాపురం రూరల్: భూమి లేని దళితులకు స్థలం పంపిణీ చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమైనదని, దళితుల పక్షపాతిగా మరోమారు రుజువు చేసుకున్నారని డీసీఎంఎస్ చైర్‌పర్సన్ సల్ల సుగుణ అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కు కల్పిస్తూ కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయంతో దళితుల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు.గతంలో చంద్రబాబు మాయమాటలు చెప్పి మోసం చేశారని, రాబోయే ఎన్నికల్లో టీడీపీని నమ్మే పరిస్థితుల్లో దళితులు లేరని స్పష్టం చేశారు. వలంటీర్ల వ్యవస్థపై పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు అమానుషమన్నారు.

25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



కొత్తూరు నివగాంలో పట్టుకున్న పీడీఎస్ బియ్యంతో విజిలెన్స్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది

కొత్తూరు : నివగాం గ్రామంలోని రాజరాజేశ్వరి రైస్ మిల్లుకు ఆనుకొని ఉన్న గోదాంలో విజిలెన్స్ సీఐ సింహాచలం, రెవెన్యూ సిబ్బంది శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో గోదాంలో టంకాల శ్రీనివాసరావు అక్రమంగా నిల్వ ఉంచిన 25 కిలోల పీడీఎస్ బియ్యంను అధికారులు పట్టుకున్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. దాడుల్లో ఆర్‌ఐ గిరీష్ కుమార్ పట్నాయిక్ వీఆర్వోలు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

శ్రీకాకుళం పాతబస్టాండ్: సీఎఫ్ఎంఎస్ ద్వారా జీతాలు పొందుతున్న ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులు ఈకేవైసీ చేయించుకోవాలని ఖజానా శాఖ ఉపసంచాలకులు సీహెచ్.రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎఫ్ఎంఎస్ లాగిన్ డీటెయిల్స్, ఇతర విలువైన సమాచారాన్ని భద్రపర్చుకునేందుకు టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

ఉద్దానంలో ఎలుగు హల్‌చల్



ఎలుగు దాడి చేయడానికి ప్రయత్నించడంతో వాహనం వదిలేసిన ప్రయాణికులు

మందస: మందస మండలంలోని ఉద్దానం ప్రాంతమైన లోహరిబంద పంచాయతీ యశోదనగర్ జీడి తోటల సమీపంలో శుక్రవారం ఓ ఎలుగుబంటి హల్‌చల్ చేసింది. ఉదయాన్ని ద్విచక్రవాహనదారులను అడ్డగించింది. వారు భయంతో వాహనాలు వదిలి పారిపోయారు. ఈలోగా ఎలుగుబంటి ఉన్న చోటే చుట్టూ తిరగడం ప్రారంభించింది. అదేపనిగా తిరుగుతుండడంతో స్థానికులు అటవీ శాఖాధికారులకు సమాచారం అందించారు. ముందుగా బారువ, మందస అటవీశాఖ అధికారులు అక్కడకు వచ్చి ఎలుగుకు గాయమైనట్లు గుర్తించారు. ఈలోగా డీఎఫ్‌ఓ నిషాకుమారి, రేంజ్ అధికారి మురళీకృష్ణం నాయుడు, ఎఫ్‌ఆర్వో నిహారిక(శ్రీకాకుళం), ఎఫ్‌ఆర్వో రాజశేఖర్(శ్రీకాకుళం), డీఆర్వో రాము(మందస), ఎఫ్‌బీఓ సంతోష్‌కుమార్(బారువా), కాశీబుగ్గ సీఐ శంకరరావు, మందస ఎస్‌ఐ వై.రవికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే ఎలుగును పట్టుకోవడానికి అధికారులు సాహసం చేయలేకపోయారు. దీంతో విశాఖపట్నంలోని జూ అధికారులకు డీఎఫ్‌ఓ నిషాకుమారి సమాచారం అందించి, జూ వెటర్నరీ అధికారి డాక్టర్ ఫణీంద్రరావు ఆధ్వర్యంలో నిపుణులను రప్పించారు. మందస వెటర్నరీ అధికారి డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్ కూడా అప్పటికే అక్కడకు చేరుకున్నారు. ఎలుగు కొంతసేపు సొమ్మసిల్లి పడిపోయినప్పటికీ, అనంతరం తేరుకుని, మళ్లీ తిరగడం ప్రారంభించింది. ఎలుగు గాయపడిందా.. లేక పిచ్చి పట్టిందా.. అనే విషయాన్ని అధికారులు నిర్ధారించలేకపోయారు. రాత్రి కావడంతో ఆపరేషన్‌ను నిలిపి వేస్తున్నట్టు అధికారులు చెప్పారు. శనివారం ఉదయాన్నే ఎలుగును పట్టుకుని, విశాఖ జూకు తరలించడానికి ప్రయత్నాలు చేస్తామని తెలిపారు.



పరిస్థితిని సమీక్షిస్తున్న డీఎఫ్‌ఓ నిషాకుమారి

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ప్రాజెక్టు మేనేజర్ నారాయణరావు

ఎచ్చెర్ల క్యాంపస్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వయం సహాయ సంఘాలకు, గ్రామీణ యువతకు అందజేస్తున్న రాయితీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వెలుగు జీవనోపాధుల జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నారాయణరావు అన్నారు. ఎచ్చెర్లలోని జిల్లా సాంకేతిక శిక్షణ కేంద్రంలో రాయితీ రుణాల మంజూరు, అర్హత అంశాలపై బ్యాంకర్లు, వెలుగు సిబ్బందికి శుక్రవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ పథకాల్లో భాగంగా అందిస్తున్న రుణాలను నిరుద్యోగులు, యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొన్ని రుణాలపై 35 శాతం రాయితీ లభిస్తుందని చెప్పారు. చిన్న పరిశ్రమలు, చిన్న చిన్న యూనిట్ల ఏర్పాటుకు రుణాలు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రధానమంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ స్కీం కింద ఆహార ధాన్యాలు, పిండి, నూక తయారీ వంటి యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రధానమంత్రి ఎంప్లాయ్ జనరేషన్ స్కీం సైతం యువతకు మంచి అవకాశమని చెప్పారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల క్లస్టర్ ఏరియా కోఆర్డినేటర్ రవి, బ్యాంకు లింకేజ్ మేనేజర్ నాగలక్ష్మి, ఏపీఎంలు రామ్మూర్తి, రత్నం, రామకృష్ణనాయుడు, శ్యామ్, కూర్మారావు, మాధవీలత పాల్గొన్నారు.

అసిరితల్లి ఆలయంలో చోరీ



అమ్మవారి ఆలయాన్ని పరిశీలిస్తున్న రెండో పట్టణ పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్: నగరంలోని సీపన్నాయుడుపేట సమీపంలో ఆసిరితల్లి అమ్మవారి దేవాలయంలో చోరీ జరిగినట్లు శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పప్పల శ్రీనివాసరావు తెలిపారు. అమ్మవారి గుడిలో ఎచ్చెర్ల మండలం పూడివలసకు చెందిన కురిటి రాంబాబు ఐదేళ్లుగా పూజారిగా సేవలందిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం ఆరు నుంచి పది గంటల వరకు, సాయంత్రం నాలుగు నుంచి ఆరుగంటల వరకు గుడి తెరిచి ఉంచుతున్నారు. ఎప్పటిలాగే గురువారం రాత్రి ఆరుగంటలకు తాళాలు వేసి ఇంటికి వెళ్లిపోయారు. శుక్రవారం ఉదయం వచ్చి చూసేసరికి గుడిలోపల పడమర గోడకు కన్నంపెట్టి ఉంది. ఉత్తర ద్వారం తలుపు తాళాలు పగలగొట్టి ఉన్నాయి. గర్భగుడికి వెళ్లి చూసేసరికి అమ్మవారి బంగారు బొట్టు, కళ్లు, పుస్తులు, శతమానం (అంతా కలిపి తులం), వెండి కిరీటం, చెవి దిద్దులు, శఠగోపం, వెండి గ్లాసు, చెంచా (మొత్తం రెండు కిలోలు) మాయమయ్యాయి. హుండీలో నగదు కనిపించ లేదు. పూజారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చోరీ జరిగిన ప్రదేశానికి సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐలు లక్ష్మణరావు, సందీప్, ఏఎస్‌ఐ, క్లూస్ టీమ్ వెళ్లి పరిసరాలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

వెంటాడిన మృత్యువు

- లారీ ఢీకొని ఆఫీస్ సబార్డినేట్ మృతి
- గతంలో ఇదే ప్రాంతంలో భార్య మృత్యువాత



ఘటన స్థలంలో మృతదేహం (ఇన్‌సెట్లో) గుల్లిపల్లి జగ్గునాయుడు (ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: కేశవరావుపేట పంచాయతీ కింతలిమిల్లు సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుల్లిపిల్లి జగ్గునాయుడు (52) దుర్మరణం చెందారు. ఈయన శ్రీకాకుళం పట్టణంలోని దివ్యాంగ శాఖ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్నారు. శ్రీకాకుళం పట్టణం వైపు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా కింతమిల్లు సర్వీస్ రోడ్డుపై వెనుక నుంచి లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో జగ్గునాయుడు అక్కడికక్కడే మృతి చెందారు. విజయనగరం ప్రాంతానికి చెందిన ఈయన 20 ఏళ్ల క్రితం ఎచ్చెర్లలో స్థిరపడ్డారు. ఎచ్చెర్ల అంబేడ్కర్ గురుకులం పక్కన ఉన్న దివ్యాంగ శిక్షణ ఉత్పత్తి కేంద్రంలో పనిచేశారు. కొన్నేళ్ల క్రితం కేంద్రం మూతపడగా ప్రస్తుతం శ్రీకాకుళం పట్టణంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఈయన భార్య జ్యోతి సైతం కింతలిమిల్లు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలోనే మృతి చెందడం గమనార్హం. మూడేళ్ల కిందట జ్యోతి పొన్నాడ కేజీబీవీలో నాన్ టీచింగ్ సిబ్బందిగా పనిచేస్తూ విధులు పూర్తయ్యాక ఎచ్చెర్లకు ఇంటికి వస్తుండగా కింతలిమిల్లు సమీపంలో ఆటో బోల్తాపడింది. అందులో ప్రయాణిస్తున్న జ్యోతి తీవ్రగాయాలై మృతి చెందింది. వీరికి ఇద్దరు కుమార్తెలు. పెద్దకుమార్తె సాయిలక్ష్మి డిగ్రీ చదువుతుండగా, చిన్న కుమార్తె లోకిత ఇంటర్మీడియట్ చదువుతోంది. తల్లిదండ్రులిద్దరూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఎచ్చెర్ల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వరల్డ్ తైక్వాండో పోటీలకు ముగ్గురు ఎంపిక



వరల్డ్ తైక్వాండో పోటీలకు ఎంపికైన చిన్నారులకు అభినందనలు తెలుపుతున్న స్థానికులు

ఇచ్ఛాపురం: ఈ నెల 15, 16 తేదీల్లో హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ ఇండోర్ స్టేడియంలో జరగనున్న వరల్డ్ తైక్వాండో పోటీలకు స్కూల్ ఆఫ్ తైక్వాండో ఇచ్ఛాపురానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు కోచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ మేరకు స్కూల్ ఆఫ్ తైక్వాండో ఆవరణలో శుక్రవారం చిన్నారులు పటాన దమయంతి, చాట్ల గిరి, ఆశి కైలాష్‌లను అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత పిలక విజయ్ భాస్కర్‌రెడ్డి, స్థానికులు బి.కృష్ణయ్య, కె.దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

16న గ్రంథాలయ మహాసభ



కథానిలయంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: విజయవాడలో ఈ నెల 16న జరిగే గ్రంథాలయ మహాసభను విజయవంతం చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని కథానిలయంలో శుక్రవారం గ్రంథాలయ మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీ వచ్చిన తర్వాత పిల్లల్లో పుస్తక పఠనాసక్తి తగ్గిపోయిందన్నారు. విషయ పరిజ్ఞానం తగ్గి యాంత్రికంగా తయారవుతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో గ్రంథాలయాల ఆవశ్యకతను వివరించేందుకు చేపడుతున్న గ్రంథాలయ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు నారాయణ వేణు, కథానిలయం కార్యదర్శి దాసరి రామచంద్రరావు, రచయత చింతాడ తిరుమలరావు, కవి కలమట దాసుబాబు, ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు కె.భానుమూర్తి, కాశీపట్నం ఇందిర తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఉషూ పోటీలకు సిద్ధం

- నేడు వప్పంగి వేదికగా స్టేట్‌మీట్
- హాజరుకానున్న 230 మంది క్రీడాకారులు



ఉషూ సాధనలో క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి ఉషూ పోటీలకు సర్వం సిద్ధమైంది. ఈనెల 15, 16 తేదీల్లో రెండు రోజులపాటు గార మండలం వప్పంగి గ్రామంలోని ఈటీఎస్ కల్యాణ మండపం వేదికగా ఏపీ రాష్ట్ర స్థాయి ఉషూ చాంపియన్‌షిప్–2023 పోటీలు జరగనున్నాయి. ఇందుకోసం జిల్లా ఉషూ అసోసియేషన్ ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేసింది. శనివారం ఉదయం 10 గంటలకు జరిగే ఈ పోటీల ప్రారంభోత్సవానికి మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. ఉమ్మడి 13 జిల్లాల నుంచి 230 మంది వరకు క్రీడాకారులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. తౌలు, సాండ కేటగిరిల్లో నాకౌట్ పద్ధతిలో పోటీలు జరుగుతాయి. జిల్లా నుంచి స్టేట్‌మీట్‌కు ఎంపికైన క్రీడాకారులకు కొద్దిరోజులుగా జిల్లా కార్యదర్శి, చీఫ్ కోచ్ రెడ్డి శివకుమార్ నేతృత్వంలో ఉన్నతంగా తీర్చిదిద్దారు. జిల్లా ఉషూ అసోసియేషన్ అధ్యక్షుడు పొగిరి కృష్ణంనాయుడు, ప్రధాన కార్యదర్శి రెడ్డి శివకుమార్ సారథ్యంలో అసోసియేషన్ ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులతో కూడిన నిర్వహణ కమిటీని నియమించారు. రిఫరీలుగా వెంకటేశ్వరరావు (విశాఖ), బి.సాయి (గుంటూరు), శ్రీనివాసరావు (కర్నూలు), వంశీ (తూర్పుగోదావరి), రెడ్డి శివకుమార్ (శ్రీకాకుళం) హాజరవుతున్నారు. పరిశీలకులుగా రాష్ట్ర ఉషూ సంఘ సంయుక్త కార్యదర్శి బి.నర్సింగరావు (గుంటూరు), ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధులు హాజరుకానున్నారు.

విజయవంతం చేయాలి..



శ్రీకాకుళం జిల్లా వేదికగా రెండోసారి రాష్ట్రపోటీలను నిర్వహిస్తుండటం సంతోషంగా ఉంది. సిక్కోలులో రాష్ట్రపోటీలు జరుగుతుండం క్రీడాకారులకు గర్వకారణం. రాష్ట్ర నలుమూలల నుంచి పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నాం. అందరూ సహకరించి విజయవంతం చేయాలి.

– రెడ్డి శివకుమార్, జిల్లా ఉషూ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి

బ్యాడ్మింటన్ పోరుకు సై!

- నేడు, రేపు గ్లోబల్ న్యూరోకేర్ జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు
- శ్రీకాకుళం ఇండోర్ స్టేడియం వేదికగా పోటీల నిర్వహణ



ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ సాధనలో క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు సర్వం సిద్ధమైంది. గ్లోబల్ న్యూరోకేర్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శని, ఆదివారం జరగనున్న జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్–2023 పోటీలను జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌కాలనీలో ఉన్న డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియం వేదికగా జరగనున్నాయి. ఏర్పాట్లను శుక్రవారం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏపీబీఏ ఉపాధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్, ప్రధాన కార్యదర్శి మెట్ట అశోక్‌కుమార్, సీఈఓ సంపతిరావు సూరిబాబు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎంఈ రత్నాజీ, డాక్టర్ దేవరెడ్డి గౌతమ్, గురుగుబెల్లి ప్రసాద్, దామోదరరావు, శైలానీ, జి.అనీల్‌కుమార్, సంఘ ప్రతినిధులు పరిశీలించారు. అండర్–11, 13, 15, 17, 19, సీనియర్స్ మెన్, ఉమెన్ ఇలా మొత్తం ఆరు విభాగాల్లో పోటీలు జరగనున్నాయి. జిల్లా నలుమూలల నుంచి 350 మందికిపైగా క్రీడాకారులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. క్రీడాకారులకు వసతి, భోజన ఏర్పాట్లు కల్పిస్తున్నారు. పోటీల ప్రారంభోత్సవానికి కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఇతర అధికారులు, బ్యాడ్మింటన్ సంఘ ముఖ్య ప్రతినిధులు హాజరుకానున్నారు. గ్లోబల్ న్యూరోకేర్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఎండీ డాక్టర్ దేవరెడ్డి గౌతమ్ మీట్ నిర్వహణకు రూ.50వేలు అందజేశారు.

గుర్తు తెలియని జంతువు దాడిలో దూడ బలి

మందస: జాతీయ రహదారి పక్కనే ఉన్న అంబుగాంలో రెండు మూగజీవాలను బలిగొన్న గుర్తు తెలియని జంతువు ఉద్దానంలోని లోహరిబంద ప్రాంతానికి చేరుకుంది. గ్రామ సమీపంలోని తోటల్లో జోగ జానకిరావు అనే రైతుకు చెందిన ఆవు దూడపై గురువారం రాత్రి దాడి చేసి తినేసింది. ఈ మేరకు అటవీశాఖ సిబ్బందికి బాధితుడు ఫిర్యాదు చేశాడు. అటవీశాఖాధికారులు స్పందించి రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,000–00
బంగారం(22సి. 10గ్రా.)	55,000–00
వెండి (కిలో)	79,500–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 460.00
విజయనగరం	రూ. 464.00
శ్రీకాకుళం	రూ. 464.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹123	₹216	₹ 226

వాహనం అడ్డగించి చోరీ

టెక్కలి రూరల్: టెక్కలి పాలకేంద్రం వద్ద గురువారం రాత్రి కొంత మంది యువకులు తన ద్విచక్ర హనాన్ని ఆపి నగదు పట్టుకుపోయినట్లు బాధితుడు శుక్రవారం టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టెక్కలికి చెందిన కోరాడ సతీష్ గురువారం రాత్రి తన ద్విచక్రవాహనంపై టెక్కలి నుంచి చలమయ్యపేట వైపు వెళ్తుండగా పాలకేంద్రం సమీపంలో ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు బండిని ఆపారు. దాడి చేసి బ్యాగ్ తీసుకుని వెళ్లిపోయారు. అందులో కొంత నగదు ఉన్నట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు టెక్కలి ఎస్‌ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫిర్యాదు చేసిన ఆరు గంటల్లోనే..

- విజయనగరం వెళ్లి దొంగలను పట్టుకున్న గార పోలీసులు
- నాలుగున్నర తులాల బంగారం రికవరీ



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ కామేశ్వరరావు

గార: బంగారం చోరీకి సంబంధించి ఫిర్యాదు అందిన ఆరు గంటల్లోనే గార పోలీసులు కేసు ఛేదించారు. ఇద్దరిని అరెస్టు చేసి బంగారం రికవరీ చేశారు. ఈ ఘటనకు సంబంధించి గార ఎస్‌ఐ ఎస్.కామేశ్వరరావు శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. పర్లాకిమిడి సమీపంలోని పుసికిడి గ్రామానికి చెందిన బంకుపల్లి జయలక్ష్మి ఈ నెల 11న శాలిహుండంలోని తన కుమార్తె ఇంటికి బయలుదేరింది. పాతపట్నం నుంచి బస్సులో వచ్చి సాయంత్రం నాలుగున్నర గంటల ప్రాంతంలో భైరి జంక్షన్‌లో దిగింది.

శాలిహుండం వెళ్లేందుకు ఆటో ఎక్కింది. అప్పటికే ఆటోలో చంటిబిడ్డతో ఉన్న తల్లి, ప్రయాణికులు ఉన్నారు. మార్గమధ్యలోకి వచ్చేసరికి అత్యవసర పని పడిందని, ఇక్కడ దిగిపోయి మరో ఆటో ఎక్కి శాలిహుండం వెళ్లాలని జయలక్ష్మిని దించేశారు. ఈ క్రమంలో జయలక్ష్మి తీసుకువచ్చిన బ్యాగు కింది భాగాన్ని కోసి అందులో నాలుగున్నర తులాల బంగారాన్ని కాజేశారు. దీనిని జయలక్ష్మి గమనించక తన కుమార్తె ఇంటికి వెళ్లిపోయింది. అక్కడ బ్యాగును చూడగా బంగారం కనిపించలేదు. ఇంటి వద్ద ఉంచేశానా అన్న సందిగ్ధతలో మరుసటి రోజు 12వ తేదీన పుసికిడిలోని తన ఇంటికి వెళ్లి వెతికింది. అక్కడా బంగారం కనిపించకపోవడంతో చోరీకి గురైందని గుర్తించి శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో గార స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసింది. వెంటనే పోలీసులు అప్రమత్తమై దర్యాప్తు చేపట్టారు. సీసీ టీవీ ఫుటేజీ, ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా విజయనగరం జిల్లాకు చెందిన గొర్లె మౌనిక, సహాయకుడు బాలకృష్ణ బంగారం దొంగిలించినట్టు గుర్తించారు. మెంటాడ మండలంలో ఉన్న వీరిద్దరిని పట్టుకుని నాలుగున్నర తులాల బంగారాన్ని రికవరీ చేశారు. అనంతరం కేసును నమోదు చేశారు. వీరిపై జిల్లాలో శ్రీకాకుళం రూరల్, జీఆర్‌పురం, రాజాం, గార వంటి పలుస్టేషన్లలో పది కేసులు ఉన్నాయని ఎస్‌ఐ తెలిపారు.